క్లుప్తంగా

స్పందన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: అర్బన్ మండల పరిధిలో స్పందనకు వచ్చే దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఆర్డీవో బీవీ రమణ గ్రామ, వార్డు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, వార్డు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకు సరిహద్దు రాళ్లు, పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని, ఆధార్ ఓటర్ కార్డు అనుసంధాన ప్రక్రియ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తహసీల్దార్ పి.సీతాపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, వార్డు రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ



రాయుడుపాలెంలో ర్యాలీ చేస్తున్న మందిరం సభ్యులు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట రాయుడుపాలెంలో శ్రీ విశ్వ కాంతి పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వాహకుడు అడబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాకాహారంపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. శాకాహారంతో ఆరోగ్యం బాగుంటుందని, రోజూ శాఖా హారం తినడం ద్వారా గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి దీర్ఘ కాలిక రోగాలు దరి చేరవన్నారు. కూరగాయలు, పప్పు దినుసులు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడబాల స్వర్ణ, సుభాషిణి, వేణు, కాశి, కుమారి, సత్య దుర్గ, ఉమా పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణికి పండ్లు, రొట్టెలు అందజేస్తున్న దాతలు

కరప: స్థానిక పీహెచ్‌సీలో గురువారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఆర్.శ్రీనివాస్‌నాయక్, ఎ.ఆశ వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గర్భిణులకు సూచించారు. పీహెచ్‌సీ సిబ్బంది గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, షుగరు టెస్ట్‌లు నిర్వహించారు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు బొబ్బిలి శ్రీనివాస్ సమకూర్చిన పండ్లు, రొట్టెలను మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గర్భిణులకు పంపిణీ చేశారు.

ట్యాంకర్ నుంచి ఆయిల్ లీక్



రైల్వే గేటు ఎదురుగా ఆయిల్ లీకైన రోడ్డుపై వేసిన గ్రావెల్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఉన్న రైల్వే గేటు ఎదురుగా సామర్లకోట నుంచి కాకినాడ వెళ్తున్న ఆయిల్ ట్యాంకరు నుంచి రోడ్డుపై ఆయిల్ లీకైంది. దీనిని గమనించని వాహన చోదకులు అదుపుతప్పి జారిపోయారు. విషయాన్ని తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆయిల్ లీకైన ప్రదేశంలో గ్రావెల్‌ను వేయించి వాహన చోదకులను అప్రమత్తం చేయించారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

కాకినాడ సిటీ: ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా జరిగింది. సీపీఎస్ రద్దుపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. ధర్నాలో వామపక్షాల నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కామిరెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్ పాల్గొన్నారు.

ఇదిగో పాత్.. అదిగో పాగా..!

- బడా, చిరు వ్యాపారులకు ఉపయుక్తంగా రహదారుల విస్తరణ
- ఫుట్‌పాత్‌లను దుకాణాల్లో కలిపేసుకుంటున్న వ్యాపారులు
- పట్టనట్టు వదిలేస్తున్న కార్పొరేషన్, పోలీసు అధికారులు



ఒకవైపు ఫుట్ పాత్ నిర్మాణంలో ఉండగానే మరోవైపు టెంట్‌లో సాగుతున్న దుస్తుల వ్యాపారం

బాలాజీచెరువు: లక్షలు వెచ్చించి ఆధునీకరిస్తున్న ఫుట్‌పాత్‌లు చిరువ్యాపారులకు కేంద్రాలవుతున్నాయి. రహదారి విస్తరణలో భాగంగా 2018లో సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి వరకూ, నాగమల్లితోట జంక్షన్ నుంచి ఆర్‌టీఓ కార్యాలయం వరకూ ఆరు అడుగుల మేర రహదారులను విస్తరించి ఫుట్‌పాత్‌లు నిర్మించి, టైల్స్, లైట్లు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. కొన్నాళ్ల వరకు పాదచారులకు అనుకూలంగా ఉన్నా క్రమేణా చిరువ్యాపారులు వీటిని ఆశ్రయించి పదో పరకో సంపాదించుకుంటున్నారు. విస్తరణలో భాగంగా ప్రధాన రహదారిలో నాగమల్లితోట జంక్షన్, ఐటీఐ వంటి ప్రాంతాల్లో బస్ షెల్టర్లు తొలగించడంతో ప్రయాణికులకు నిలువ నీడలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధాన రహదారి పరిస్థితి ఇలా ఉంటే బాలాజీచెరువు, భానుగుడి, పద్మప్రియ కాంప్లెక్స్, ఇంద్రపాలెం బ్రిడ్జి, రామారావుపేట, భానుగుడి దుర్గమ్మ గుడి, కోకిల సెంటర్ వంటి ప్రాంతాల్లో కేవలం ప్రధాన రహదారి తప్ప ఫుట్‌పాత్ అనేది కనపడదు. ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులు వారి ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను కలిపేసుకుని దుకాణాలను విస్తరించుకున్నారు. విద్యాసంస్థల పనివేళల్లో వచ్చిపోయే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. నిలపాల్సిన చోట బస్సులు నిలపకపోవడంతో వారు దాదాపు కిలోమీటరు మేర భానుగుడికి వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్, లేదా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆయా అక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందిగా ఉంది



రోడ్ల విస్తరణతో పాటు ఫుట్‌పాత్‌లు టైల్స్,లైటింగ్ వంటివి ఏర్పరచి వ్యాపారస్థులకు చాలా సౌకర్యంగా ఏర్పాటు చేసిన్నట్లుగా ఉంది. ఉంటున్నాయి.వీటిపై అధికారులు స్పందించి ప్రజలకు ఆసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

– కె.శ్రీనివాసరావు, జగన్నాథపురం

షాపుల్లో కలసిపోతున్న ఫుట్‌పాత్‌లు



టూ టౌన్ నుంచి జగన్నాథపురం వరకూ ఫుట్‌పాత్ చూద్దామన్నా కనబడదు. దుకాణ యజమానులు, ఖాళీ ప్రదేశాల్లో ఇతరులు ఫుట్‌పాత్‌లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తుంటారు. పాదచారులు మెయిన్ రోడ్డు మీదనే ప్రయాణించాలి.

– ములంపాక శ్రీనివాసరావు, లైబ్రేరియన్

సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది

ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసేవాళ్లను తొలగించి పక్కవీధి విక్రయించుకోవాలని సూచిస్తున్నాం. అలాగే ఫుట్‌పాత్‌పై నడిచే పాదచారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచిస్తున్నాం. వీటిపై తమ సిబ్బంది పర్యవేక్షణ నిరంతరం ఉంటుంది.

– చైతన్యకృష్ణ, ట్రాఫిక్ సీఐ

ఉత్సాహంగా కిడ్నీ డే



కిడ్నీ పెయింటింగ్‌కు ఇరువైపులా కూర్చున్న విద్యార్థులు

కరప: పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ కిడ్నీ డే నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల మైదానంలో కిడ్నీ ఆకారంలో పెయింటింగ్‌వేసి, రంగులువేశారు. కిడ్నీ పెయింటింగ్‌కు ఇరువైపులా వరల్డ్ కిడ్నీ డే ఇంగ్లిషు అక్షరమాలలో వారు కూర్చున్నారు. హెచ్‌ఎం ఎస్ఎస్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ శరీరంలోని అవయవాల ప్రాధాన్యాన్ని గుర్తించేందుకు ఏటా మార్చి 9న వరల్డ్ కిడ్నీ డే నిర్వహిస్తున్నామన్నారు. ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి.వెంకట్రావు, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 27వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. 27వ డివిజన్‌లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మరెంత చేరువయ్యేందుకు గడగడపకూ మన ప్రభుత్వ ఉపయోగపడుతుందన్నారు. నేరుగా ప్రజలు వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని, తక్షణమే పరిష్కరించే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇటువంటి ప్రభుత్వంలో పని చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. డివిజన్‌లో సమస్యలు చాలా పరిష్కరించామని, ఇంకా ఏమైనా ఉంటే వాటినీ పరిష్కరిస్తామని అన్నారు. డివిజన్‌లో అర్హులైన వారికి ఏప్రిల్ చివరి నాటికి ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పుసులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు రాజాన సూర్యప్రకాస్, ఎస్ఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏ జాతీయ బోర్డు సభ్యుడిగా గాంధీ



గాంధీని సత్కరిస్తున్న అసోసియేషన్ రీజినల్ చైర్మన్ డాక్టర్ రోలెండ్ విలియమ్స్ తదితరులు

కాకినాడ కల్చరల్: వైఎంసీఏ నగరశాఖ కార్యదర్శి డాక్టర్ పి.జాన్ విజయకుమార్ గాంధీ అసోసియేషన్ జాతీయ బోర్డు సభ్యుడిగా ఎన్నికైనట్టు అసోసియేషన్ రీజినల్ చైర్మన్ డాక్టర్ రోలెండ్ విలియమ్స్ తెలిపారు. ఈ మేరకు స్థానిక సిటీ టిబెర్నికల్ చర్చి సమావేశ మందిరంలో గురువారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో గాంధీని సభ్యులు ఘనంగా సత్కరించారు. గాంధీ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెట్సీ విలియమ్స్, హెండ్రీ, ప్రభాకర్, మోజెస్ బెన్ని, శామ్యూల్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం

జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు దడాల



జాషువా గిరిని అభినందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉంటామని జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు దడాల జాషువా గిరి పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆయన గురువారం కలసి ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకంతో పదవిని ఇచ్చిన సీఎం, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా జాషువాను ఎమ్మెల్యే కన్నబాబు శాలువాతో సత్కరించి పార్టీ పటిష్టానికి కృషి చేయాలని సూచించారు. త్వరలో నియోజవర్గాల వారీగా క్రిస్టియన్ మైనార్టీ విభాగాల సభ్యులను నియమిస్తూ జిల్లా కమిటీని ప్రకటిస్తామన్నారు. కాకినాడ సిటీ పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టరు బి.ఇమాన్యుయేల్, కాకినాడ సిటీ, రూరల్ పాస్టర్స్ ఫెలో షిప్ నాయకులు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీవైఎఫ్ అధ్యక్షుడి ధన్యవాదాలు..

కాకినాడ రూరల్: సీవైఎఫ్ సేవలను గుర్తించి ఆ ప్రతినిధులను వివిధ పదవులతో ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌కు సీవైఎఫ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ బీహెచ్‌వీ మూర్తిరాజు కృతజ్ఞతలు తెలిపారు. సీవైఎఫ్ ప్రధాన కార్యాలయంలో క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈ మధ్యకాలంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రెవరెండ్ దడాల జాషువా గిరిని సీవైఎఫ్ బోర్డు ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బిషప్ డి.విలియమ్స్, సీవైఎఫ్ నేషనల్ చైర్మన్ రెవరెండ్ మోజస్ కిరణ్, స్టేట్ చైర్మన్ జంగా గగారిన్, జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడ హైస్కూల్‌లో డీవైఈఓ విచారణ

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డీవైఈఓ ఆర్‌జేడి రాజు గురువారం విచారణ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థి తల్లి గ్రీవెన్‌సెల్‌లో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థి తల్లి నుంచి హెచ్‌ఎం 30 వేలు తీసుకున్నట్లు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేట్‌మెంట్ రికార్డు చేశామన్నారు. ఆ సొమ్మును స్వీపర్ కోసం తీసుకున్నానని అవి మళ్లీ తిరిగి చెల్లించినట్లు హెచ్‌ఎం ఆధారాలతో చూపించినట్లు డీవైఈఓ తెలిపారు.

గురజనాపల్లిలో ఎమ్మెల్యే పర్యటన



ఏఎంసీ చైర్మన్ కర్నాసులను పలకరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గురజనాపల్లిలో గురువారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులును కలసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కర్రి చక్రధర్ తదితరలు ఎమ్మెల్యే కన్నబాబు వెంట ఉన్నారు.

టీడీపీతోనే బడుగుల సంక్షేమం

కాకినాడ సిటీ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం కాకినాడ రూరల్ మండలం తూరంగి ఏఎస్ఆర్ కాలనీ, మహాలక్ష్మినగర్, నాయీ బ్రాహ్మణ కాలనీల్లో ఇంటింటికి మీ అనంతలక్ష్మి నిర్వహించారు.

ఆ జీవోల్లో స్థానం కల్పించండి

కాకినాడ క్రైం: వైద్య ఆరోగ్యశాఖలో రేషనలైజేషన్‌లో భాగంగా ఇటీవల అమలులోకి వచ్చిన జీవో 143, జీవో 32లో ఆఫీస్ సబార్డినేట్, ఎంఎన్‌వో కేడర్లకు స్థానం కల్పించాలని కోరుతూ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘ జిల్లా ప్రతినిధులు గురువారం ఉన్నతాధికారులకు విన్నవించారు. ఆరోగ్య సంచాలకుడు వి.రామ్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబులను వెలగపూడిలో కలసి ఈ మేరకు వినతి సమర్పించారు. పీహెచ్‌సీల్లో కామన్ స్టాఫ్ పాటర్న్‌గా 14 రకాల ఉద్యోగాలను పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. కొనసాగింపుగా ఆఫీస్ సబార్డినేట్, ఎంఎన్‌లో కేడర్లను సదరు జీవోల్లో చేర్చాలని విన్నవించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారులను కలసిన వారిలో జిల్లా నాయకులు ఎ.దేవర, ఎస్.రాజశేఖర్, పి.వెంకయ్య, లావణ్య కృష్ణ స్వామి ఉన్నారు.

త్వరలో ఆసుపత్రి దర్శనాలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- కిడ్నీ దాతలకు ఘనంగా సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించేందుకు ఏ నాయకుడూ రూపొందించని బృహత్కార్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాల పరిధిలో త్వరలో ఆసుపత్రి దర్శనాలు (హాస్పిటల్ విజిట్స్) చేపట్టబోతున్నట్లు తెలిపారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కిడ్నీ దాతల సత్కార కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత వైఎస్సార్ విశ్వవిద్యాలయ విశ్రాంత వీసీ డాక్టర్ ఐవీ రావు, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఆర్‌ఎస్ జవహర్ వంటి ప్రముఖులు అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ అవయవదాన ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సత్కార్యాన్ని ఓ యజ్ఞంలా చేపట్టి కొనసాగిస్తున్న అపోలో ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. దాదాపు ప్రతి రోగాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. త్వరలో 13 వైద్య కళాశాలలు ఏర్పాటు కానున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యుల నియామక ప్రక్రియ శరవేగంగా సాగుతోందని ఆయన అన్నారు. జనసాంద్రతకు అనుగుణంగా పరిశీలిస్తే దేశంలో 40 శాతం మంది వైద్యులు తక్కువ ఉన్నారని, రాష్ట్రంలో ఆ లోటు 0.5 శాతమేనని తెలిపారు. ఆ అర శాతం లోటూ మార్చి నెలాఖరుకు భర్తీ కానుందని ఎమ్మెల్యే ప్రకటించారు. ఆరోగ్యశ్రీ రూపకల్పన కాకినాడ వైద్యుడు ఐవీ రావు మార్గనిర్దేశంలో జరగడం గర్వించదగ్గ విషయమని అన్నారు. కాకినాడ వాసుల్లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం ఉన్న వారు తమ ప్రయత్నాల వల్ల ప్రయోజనం పొందలేకపోతే తనను నేరుగా సంప్రదించాలని ఎమ్మెల్యే అన్నారు.

ఒక శరీర దానం వల్ల 8 మందికి పునర్జన్మ

డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ ఓ వ్యక్తి శరీరం నుంచి సేకరించిన అవయవాలు కనీసం 8 మందికి పునర్జన్మనిస్తాయని తెలిపారు. ప్రతి టీచింగ్ ఆసుపత్రిలో అవయవ దాన యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వం జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవ దానాన్ని విస్తృతం చేస్తోందని, ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు జీవన్‌దాన్‌లోని ఆర్గాన్ రిజిస్టర్‌లో తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అనంతరం పలువురు కిడ్నీ దాతల్ని అపోలో ఆసుపత్రి తరఫున అతిథులు సత్కరించారు. అపోలో ఆస్పత్రి సీనియర్ జనరల్ మేనేజర్ ఐవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోలో వైద్యులు జీవీ.రావు, కరుణాకర్ రెడ్డి, పి.రవీంద్ర, పి.శర్మిష్ట, నాగేశ్వరరావు, పీపీ చటర్జీ కిడ్నీ ఆరోగ్యం, తీసుకోవలసిన జాగ్రత్తలు, కిడ్నీ దానం, ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై అవగాహన కల్పించారు. ఆసుపత్రి తరఫున జీవీఆర్ మూర్తి మాట్లాడుతూ, అధిక బ్రెయిన్ డెడ్‌లు జీజీహెచ్ కేంద్రంగా జరుగుతున్నాయని, వెలకట్టలేని విలువైన అవయవాలు వృథా అవుతున్నాయనీ, హార్వెస్టింగ్ అనుమతులిస్తే రోగుల్ని తరలించి వారి అనుమతితో అవయవాలు సేకరించే వెసులుబాటు తమ వద్ద ఉందనీ, అందుకు తగ్గ అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ద్వారంపూడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



పండ్లు, స్వీట్లు, పుష్పాల అలంకారంలో స్వామివారు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి శ్రీ పుష్పయాగం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు వివిధ రకాలు పుష్పాలు, వివిధ రకాలు స్వీట్లు, పండ్లతో పుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవ క్రీడలు



షాట్‌పుట్‌లో పోటీపడుతున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు గురువారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. క్రీడా మైదానంలోని అథ్లెటిక్స్ ట్రాక్‌లో 100, 400 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 60 మంది మహిళలు హాజరయ్యారు. పోటీల నిర్వహణలో కోచ్‌లు సతీష్‌కుమార్, రుద్ర, సురేష్, అలీష షరీఫ్, నాగేంద్ర పాల్గొన్నారని చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.